పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ముగ్గురి అరెస్టు

దామెర, డిసెంబర్ 1 : మండలంలోని ఊరుగొండ పెద్ద చెరువు సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదివారం ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన ఎనిమిది మందితో పాటు పసరగొండ గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేకాడుతున్నారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ.5,460, నాలుగు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని, పారిపోయిన మరో ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పరకాల, డిసెంబర్ 1 : నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల విజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల పరకాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యార్హతలు ఉండి పార్ట్‌టైం స్వీపర్లు, అటెండర్లుగా కొనసాగుతున్న వారికి పదోన్నతి అవకాశం కల్పించేలా కృషి చేస్తానన్నారు. జిల్లా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు పాటు పడుతానన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి మాడుగుల రాజమౌళి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, డిసెంబర్ 1 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని మచిలీబజార్ ఫీడర్‌లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రాజ్‌పుత్‌వాడ, పద్మాక్షి రోడ్డు ఏరియాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు బల్దియా గ్రీవెన్స్

వరంగల్, డిసెంబర్ 1 : గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

దామెర, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో ఏఐసీటీయూలో పలువురు కార్మికులు చేరారు. ఈ సందర్భంగా వారికి జిల్లా ఇన్‌చార్జి ఎన్‌రెడ్డి హంసారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులు తమ హక్కులకోసం పోరాడాలన్నారు. ఆశవర్కర్లు చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్నారని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దామెరలో కార్మికుల కోసం కమ్యూనిటీ భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాగార్జున, సావిత్రి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లినర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

యువతపై గంజాయి పడగ

- నిద్ర మత్తులో పోలీసులు
- భారీగా నగరానికి చేరుతున్న గంజాయి
- నిర్మూలన చర్యలు శూన్యం

నయీంనగర్, డిసెంబర్ 1 : నగరంలో గంజాయి మత్తు పీక్ స్టేజ్‌కి చేరింది. వయసుతో సంబంధం లేకుండా చాలామంది గంజాయికి బానిసలై కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీసులేమో గంజాయి దొరికితే భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని చిన్నచిన్న కేసులు నమోదు చేసి వదిలిపెడుతున్నట్లు తెలిసింది. గతంలో రంగనాథ్ సీపీగా ఉన్నప్పుడు గంజాయిపై ఉక్కుపాదం మోపారు. ప్రస్తుత సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని సమాచారం. భద్రాచలం, మహారాష్ట్ర, నర్సంపేట మీదుగా లారీలు, కార్లలో.. విజయవాడ, బెంగళూరు నుంచి రైళ్ల ద్వారా నగరానికి గంజాయి తీసుకువస్తున్నట్లు తెలిసింది. గంజాయిని వంగపహాడ్ ఔటర్ రింగ్ రోడ్డు, హసన్‌పర్తిలోని కళాశాలలు, ప్రశాంత్‌నగర్, ఫాతిమానగర్ నిట్ గేట్, సబ్‌స్టేషన్ ఎదుట, కోమటిపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాల వద్ద, గుండ్ల సింగారం, లష్కర్ సింగారం గోదాం సమీపంలో, హనుమకొండ బస్‌స్టేషన్, బొక్కలగడ్డ, అలంకార్ జంక్షన్ సమీపంలో, నయీంనగర్‌లోని ఓ బార్, ప్రైవేట్ హాస్టల్, ఫాతిమానగర్ సమీపంలో, శివనగర్, వరంగల్ రైల్వేస్టేషన్, ఉర్సుగుట్ట, ఎనుమాముల మార్కెట్, లేబర్ కాలనీ, నర్సంపేటలోని ఓ కాలేజీ వద్ద, కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది.

చైన్ సిస్టం..

గంజాయి విక్రేతలు వారికి తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరు. చైన్ సిస్టం పద్ధతిని ఫాలో అయ్యి తెలిసిన వారు వస్తే వారికి అటు నుంచి లోకల్ వ్యక్తులకు అమ్ముతారు. కొత్త వారు ఎంత అడిగినా తమకు తెలియదని, చెప్పినా వినకుంటే దాడులకు దిగుతారని తెలిసింది. అలాగే గంజాయి చీప్‌గా దొరుకుతుండడంతో యువత గంజాయి మత్తులో మునిగి తేలుతున్నారు. గంజాయి మత్తులో రాత్రి సమయంలో బైక్‌లపై విన్యాసాలు చేస్తు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా రాత్రి 10గంటలు దాటాక హనుమకొండ, వరంగల్ బస్‌స్టేషన్లు, వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల పరిసరాల్లో వాహనదారులను భయాందోళనకు గురయ్యేలా వీరి ప్రవర్తన ఉంటుంది. ఏమైనా అంటే దాడులకు దిగుతున్నారని తెలిసింది.

నిద్రమత్తులో పోలీసులు..

గంజాయి కట్టడికి వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రత్యేకంగా నార్కోటిక్ టీం ఏర్పాటు చేశారు. దొరికిన వారే దొంగలు అనే విధంగా టీం పని చేస్తున్నదని, దీంతో ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కొందరు పోలీసులు రాత్రి డ్యూటీలో గంజాయి విక్రయించే ప్రాంతాలనే టార్గెట్‌గా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది.

కేసులు నమోదు చేస్తున్నాం..

- ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఎస్బీ, డ్రగ్ అండ్ కంట్రోల్

వరంగల్ సీపీ గంజాయి, మాదక ద్రవ్యాలను నిరోధించేందుకు ప్రత్యేకంగా డ్రగ్ అండ్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, ముగ్గురు ఆర్‌ఎస్సైలు, 11 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు నెలల క్రితం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 50కి పైగా కేసులు నమోదు చేశాం. నిట్ గేట్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గల్లీలో గంజాయి తాగుతున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. కాలనీ వాసులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

న్యాయమూర్తులు, న్యాయవాదుల సమష్టి కృషితోనే బాధితులకు న్యాయం

ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్

సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్

హనుమకొండ, డిసెంబర్ 1 : న్యాయమూర్తులు, న్యాయవాదుల సమష్టి కృషితోనే బాధితులకు సరైన న్యాయం జరుగుతుందని ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరుగుతున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఏఎల్) తెలంగాణ రాష్ట్ర మహా సభల్లో ఆదివారం న్యాయమూర్తులు, న్యాయవాదుల సంబంధాలు – వృత్తిపరమైన నైతిక విలువలు అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టుల గౌరవం కాపాడేలా న్యాయవాదులు మెలగాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందించాలన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ హక్కుల గురించి మాట్లాడుతున్నారే కానీ బాధ్యతలను గుర్తించడం లేదన్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నిర్మలా గీతాంబ మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు ఆందోళన కరమన్నారు. న్యాయవ్యవస్థ విలువలను గౌరవించాలని సూచించారు. రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులను అరికట్టాలని, తక్షణమే ప్రొటెక్షన్ యాక్ట్ అమల్లోకి తేవాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ ప్రభుత్వాన్ని కోరారు. రూ.10లక్షల ఆరోగ్య బీమా అమలు చేయాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం కోసం సంవత్సరానికి రూ.15 కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వాలన్నారు. ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ సురేశ్, జార్ఖండ్ బార్ కౌన్సిల్ సభ్యుడు రషీద్, న్యాయవాదులు విద్యాసాగర్‌రెడ్డి, ఆదిరెడ్డి, బీమనాథం శ్రీనివాస్, అయిప్సో జాతీయ కార్యదర్శి కేవీఎల్, వరంగల్, జనగామ, ములుగు జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీవన్‌గౌడ్, చంద్రరుషి, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ తీస్తున్న ఏవీవీ విద్యార్థులు

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

వరంగల్, డిసెంబర్ 1 : ఏవీవీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏవీవీ కళాశాల నుంచి ఎంజీఎం సెంటర్ మీదుగా ఐఎంఏ హాల్ వరకు విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ తీశారు. 87 ఫీట్ల రెడ్ రిబ్బన్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 11 వేలకు పైగా హెచ్ఐవీ పాజిటివ్ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించే అంశమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పవన్ కల్యాణ్, రాజేశ్, శివరాజ్, ఫయాజ్, దేవీశ్రీ ప్రసాద్, మాన్విత, నవ్యశ్రీ, విన్ను స్వాతి, చిరంజీవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కళాశాల బాధ్యులు

'సాట్‌క్యూ' టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

హనుమకొండ, డిసెంబర్ 1 : ఎస్ఆర్ విద్యాసంస్థలు వడ్డేపల్లి రోడ్డులోని ఎడ్యు సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన సాట్ క్యూ(ఎస్ఆర్ అకాడమీ టాలెంట్ క్వెస్ట్) టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఫీజులో రాయితీ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి మాట్లాడుతూ.. విద్యతో ఉన్నతావకాశాలు పొందడమే కాకుండా దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. భవిష్యత్ తరాలు బాగుపడాలంటే విద్య ఆయుధం కావాలని, ఇంటర్మీడియట్ విద్యా చాలా కీలకమన్నారు. ఐఐటీ, నిట్‌లో ప్రతి సంవత్సరం ఎస్ఆర్ విద్యార్థులు వేల మంది అడ్మిషన్ పొందుతున్నారన్నారు.

'బీసీ' సబ్సిడీ రుణాలు అందించాలి

హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

కాజీపేట, డిసెంబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన బీసీలందరికీ బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాజీపేటలో ఆయన ఆదివారం మాట్లాడుతూ.. తెలంగాణలో గత ప్రభుత్వం ప్రత్యేకంగా బీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి కుల వృత్తులపై ఆధారపడిన నిరుద్యోగ యువతీయువకులకు రూ.లక్ష వరకు వ్యక్తిగత సబ్సిడీ రుణాలను బీసీ బంధు పేరుతో అందించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడిచినా ఇప్పటి వరకు సబ్సిడీ రుణాలు అందించలేదన్నారు. ఈ మేరకు అర్హులైన బీసీలకు రుణాలు అందివ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. కురమ, రజక, వడ్డెర, మేదరి, రాష్ట్ర అధ్యక్షులు ఆకారపు మోహన్, నూతనకంటి ఆనందం, పల్లపు సమ్మయ్య, ప్రతాపగిరి గోవర్ధన్, సాయికుమార్, రామ్మోహన్, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పూలే వసతి గృహంలో రేవూరి తనిఖీలు

ఆత్మకూరు/పరకాల, డిసెంబర్ 1 : గూడెప్పాడ్‌లోని పెద్దాపురం మహాత్మా జ్యోతిరావు పూలే వసతి గృహాన్ని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పెద్దాపురంలో పాఠశాల భవన నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించామనని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. పాఠశాలకు సోలార్ హీటర్ ప్లాంట్‌ను మంజూరు చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ దామెర అనిత, సీఐ క్రాంతి కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కమలాపురం రమేశ్, మాజీ జడ్పీటీసీ అంబటి రాజస్వామి పాల్గొన్నారు. అలాగే పరకాలలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రేవూరి పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం, కాంటా అయిన, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ధర్మసాగర్, డిసెంబర్ 1 : మండలంలోని ఎలుకుర్తి గ్రామంలో నరిశెట్టి పెద్ద కొమురయ్య(75), పెద్దపెండ్యాల గ్రామంలో పూండ్రు సుభద్ర (65) మృతి చెందారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే రాజయ్య మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కర్ర సోమిరెడ్డి, లాల్, దేవేందర్‌రావు, హరీశ్, రాజు ఉన్నారు.

సింహగర్జన సభకు తరలిన మాల కులస్తులు

కాజీపేట/శాయంపేట, డిసెంబర్ 1 : ఎస్సీ వర్గీకరణ ఆపాలని కోరుతూ హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు కాజీపేట నుంచి ఆదివారం తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం సభ్యులు తరలి వెళ్లారు. సభకు తరలుతున్న బస్సుకు తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ్ర నర్సింగరావు జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం మాలల చిన్నచూపు చూడడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి మాలలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సంఘం నాయకులు మర్యాల కృష్ణ, బండి విజయ్‌కుమార్, పప్పుల గోవర్ధన్, సీహెచ్ కొమ్మాలు, బండి రాంచందర్, పడిదెల శేఖర్, సాంబయ్య, రాజలింగం, యాదగిరి, కుమారస్వామి ఉన్నారు. అలాగే తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో మాల సింహగర్జనకు శాయంపేట మండలం నుంచి దాదాపు 300 మంది నాయకులు తరలివెళ్లారు.


ముల్కనూరులోని పరుపు బండపై ఉన్న నూరుడు గుంతలను చూపుతున్న ఎకో ట్రావెలర్ ప్రతాప్

ముల్కనూరులో రాతి పనిముట్ల పరిశ్రమ

ఆదిమ మానవుడి కాలంలోని గ్రూవ్స్‌ను కనుగొన్న ఎకో ట్రావెలర్ ప్రతాప్

భీమదేవరపల్లి, డిసెంబర్ 1 : ముల్కనూరులోని మడేలయ్య గుడి వద్ద ఉన్న పరుపు బండపై నవీన శిలాయుగపు ఆదిమ మానవుల ఆనవాళ్లను ఎకో ట్రావెలర్ ప్రతాప్ కనుగొన్నారు. 5000 బీసీ–3500 బీసీ మధ్యకాలంలో సుమారు 40 వరకు గ్రూవ్స్ (నూరుడు గుంతలు) ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇనుము వాడుకలోకి రాని రోజుల్లో ఆదిమ మానవులు రాతిగొడ్డళ్లు, పనిముట్లు, ఇతర ఆయుధాలు పదును చేసుకోవడం వల్ల ఈ గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. 7వేల ఏళ్ల క్రితమే రాతి పనిముట్ల కారాగారానికి ముల్కనూరు కేంద్రంగా ఉందని నిర్ధారించారు. ఇంతటి చారిత్రక నేపథ్యం కలిగిన ఈ పరుపు బండను కాపాడుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

పోలీస్ కిష్టయ్యకు దాస్యం నివాళి

హనుమకొండ, డిసెంబర్ 1 : తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్యకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ నివాళులర్పించారు. అదాలత్ జంక్షన్ వద్ద అమరవీరుల స్తూపం వద్ద కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల కుటుంబాలకు తెలంగాణ సమాజం రుణపడి ఉంటుందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, పోలపల్లి రామ్మూర్తి పాల్గొన్నారు. అలాగే మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడైన పోలీస్ కిష్టయ్య జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా అదాలత్ జంక్షన్‌లోని అమరవీరుల స్తూపం వద్ద వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు బయ్య స్వామి, పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలని, తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడిగా ప్రకటించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో బుస్సా మల్లేశం, చొప్పరి సోమయ్య, ఎన్నార్ రాజ్‌కుమార్, దువ్వ నవీన్, చుంచు కృష్ణ, పిట్టల రమేశ్, భయ్యా శోభన్, పులి విక్రం పాల్గొన్నారు.

కిష్టయ్య చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి..

నయీంనగర్ : తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని మెపా(ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. పోలీస్ కిష్టయ్య 2009, డిసెంబర్ 1న తుపాకీతో కాల్చుకుని వీరమరణం పొంది తన రక్తంతో ఉద్యమానికి కొత్త దిశ చూపించాడన్నారు. కార్యక్రమంలో బోనాల రమేశ్, రాజు, రామకృష్ణ, రవీందర్, శ్యామ్, వినోద్, విజయ్ పాల్గొన్నారు.


కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

అమరవీరుల స్తూపం వద్ద కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నేతలు

విద్యార్థినులతో కలిసి అల్పాహారం తింటున్న కలెక్టర్ ప్రావీణ్య

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కలెక్టర్ ప్రావీణ్య.. బాలసముద్రం ఎస్సీ బాలికల వసతిగృహం తనిఖీ

హనుమకొండ, డిసెంబర్ 1 : ప్రతి రోజు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం బాలసముద్రంలోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలోని భోజనశాల, తాగునీటి సౌకర్యం, శానిటరీ ఇతర సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. అనంతరం తాగునీటి ఫిల్టర్ పాయింటును పరిశీలించి విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, గిరిజన సంక్షేమ అధికారి ప్రేమలత, వసతి గృహాల సంక్షేమ అధికారి కృష్ణ, వార్డెన్ జయలక్ష్మి పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ చైర్మన్‌ను కలిసిన మణికంఠ

నయీంనగర్, డిసెంబర్ 1: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ)కొత్త చైర్మన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశంను గోపా సోషల్ మీడియా ఇన్‌చార్జి మణికంఠ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటేశంకు శుభాకాంక్షలు తెలుపుతున్న మణికంఠ

విద్యార్థులను అభినందిస్తున్న డిస్నీల్యాండ్ యాజమాన్యం

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు డిస్నీల్యాండ్ విద్యార్థులు

దామెర, డిసెంబర్ 1 : రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఓగులాపురం సమీపంలోని డిస్నీల్యాండ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో 'ఓపెన్‌వెల్ ఆర్గానిక్ ఫామ్' అనే అంశంపై ఎనిమిదో తరగతి విద్యార్థి ఎం నితిన్ ప్రదర్శించిన ఎగ్జిబిట్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అలాగే తోట శివకేశవ 'ఈజీలోడ్ క్యారియర్ ఫర్ లేబర్' అనే అంశంపై ప్రదర్శించిన ఎగ్జిబిట్ జిల్లా స్థాయిలో మూడో స్థానంలో, గట్టు అనన్యరెడ్డి ప్రదర్శించిన 'ట్యూన్‌మాస్ డంపింగ్ టెక్నాలజీ' ఎగ్జిబిట్ మూడో స్థానంలో నిలిచింది. కాగా, నితిన్, శివకేశవ, అనన్యరెడ్డిని పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, డైరెక్టర్లు బాలుగు శోభారాణి, దయ్యాల రాకేశ్‌భాను, దయ్యాల దినేశ్‌చందర్ అభినందించారు.

PRAJA PAALANA PRAJA VIJAYOTSAVAALU
2K RUN
TELANGANA RISING
2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్

డ్రైనేజీ పనులు ప్రారంభం

మొక్కలు నాటిన ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ, డిసెంబర్ 1 : బాలసముద్రంలో రూ. 20 లక్షలతో చేపట్టిన సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల కోమల కిషన్, మాజీ కార్పొరేటర్ మాధవీరెడ్డి పాల్గొన్నారు. అలాగే వడ్డేపల్లిలోని జీఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. మాజీ కార్పొరేటర్ నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు పున్నం, అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు రవీందర్, రామచంద్రారెడ్డి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేసారు. వరంగల్ సైన్స్ సెంటర్‌ను సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి పాల్గొన్నారు.

జేఎన్ఎస్‌లో 2కే రన్..

నయీంనగర్ : ఈ నెల 9వ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో 2కే రన్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. డీఎస్‌డీవో అశోక్, డీడబ్ల్యూవో జయంతి, ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఐలి చంద్రమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


ఐనవోలు : విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో ఆనందం


శాయంపేట : విజేతలతో ఎంఈవో భిక్షపతి

శాయంపేట/ఐనవోలు, డిసెంబర్ 1 : ప్రజా వజ్రోత్సవాల్లో భాగంగా మండల విద్యా వనరుల కేంద్రంలో విద్యార్థులకు 'పునరుత్పాదక శక్తి వనరులు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థిని రచన ప్రథమ స్థానం, కేజీబీవీ విద్యార్థిని అశ్విత ద్వితీయ స్థానం, సోషల్ వెల్ఫేర్ విద్యార్థిని అక్షిత తృతీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు ఎంఈవో గడ్డం భిక్షపతి డైరీలను బహుమతిగా అందజేశారు. ఐనవోలు మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థిని జీ శరణ్య ప్రథమస్థానం, ఎంజేపీ విద్యార్థిని సీహెచ్ సృజన్ ద్వితీయ స్థానం, పంథిని జడ్పీ పాఠశాల విద్యార్థి పీ వర్ష, సింగారం జడ్పీ పాఠశాలకు చెందిన జీ రాంచరణ్ తృతీయ స్థానం సాధించారని ఎంఈవో పులి ఆనందం తెలిపారు. వీరికి మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఉపాధ్యాయులు సమ్మయ్య, రియాజ్, సుధాకర్, పీఆర్‌పీ శోభారాణి, సీఆర్‌పీ రాజ్‌కుమార్, రేవతి పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ఎల్కతుర్తి, డిసెంబర్ 1 : యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో గ్రానైట్ ఫ్యాక్టరీ కార్మికులకు డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.